క్లుప్తంగా

ఓంకారేశ్వరునికి పూజలు

బత్తలపల్లి: మాఘమాస సోమవారం మండల కేంద్రంలోని శ్రీలలితా త్రిపుర సందరీ సమేత ఓంకారేశ్వరాలయంలో ప్రధాన అర్చకులు కేశవస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివమాలధారులు ఇరుముడి కట్టుకుని శ్రీశైలం బయల్దేరారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, నాయకులు యోగానంద ఆచారీ, మందల నారాయణ, సాకే కిరణ్‌కుమార్, ప్లాట్ల సూరీ, తాళ్లూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ


పర్వతయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గీతానగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పర్వతయ్యను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీశారు. అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, చేనేత ప్రముఖులు కాచర్ల అంజి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు ప్రకాష్, నాయకులు ఉక్కిసిల గోవిందు, గడ్డం రంగా, గుర్రం రాజా తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ తప్పనిసరి


సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

అమడగూరు: సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మహమ్మదాబాద్ గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వలంటీర్లు కూడా వారంలో మూడు రోజులు బయోమెట్రిక్ వేయాలన్నారు.

పంచలోహ ప్రతిమ వితరణ


పంచలోహ ప్రతిమను అందజేస్తున్న దాతలు

బత్తలపల్లి: గంటాపురంలో భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీవిరాట్ గురజాల అప్పస్వామికి పంచలోహ ప్రతిమను వితరణ చేశారు. బత్తలపల్లికి చెందిన శ్రీసాయిశివ ఫర్టిలైజర్స్ యజమాని ముక్తాపురం సరస్వతి, ముక్తాపురం సోమశేఖర్‌రెడ్డి దంపతులు రూ.50 వేలు విలువ చేసే పంచలోహ ప్రతిమతో పాటు అప్పస్వామికి వెండి మీసాలు, కన్ను ఆభరణాలు చేయించి సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అప్పగించారు. అదే విధంగా గంటాపురం గ్రామానికి చెందిన వెంకటనాయుడు, లక్ష్మీదేవి దంపతులు స్వామి వారికి వెండి పాదుకలు, 20 తులాల వెండి పళ్లెం వితరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కోమందూరు స్వామి వారికి పంచలోహ, వెండి ఆభరణాలు అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

విధుల్లోకి పశు వైద్య సహాయకులు

నల్లమాడ: తొమ్మిది మంది పశువైద్య సహాయకులు సోమవారం విధుల్లో చేరారు. ఇంతియాజ్, భానుప్రకాష్ నాయక్, జ్యోతి, గాయత్రి, చిట్టెమ్మ, హరితాబాయి, ఆంజనేయులు, హరి, మహేష్‌నాయక్ ఎంపీడీఓ కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టులు అందజేసి తమకు కేటాయించిన గ్రామాల్లో విధులు నిర్వర్తించేందుకు వెళ్లారు.

నేడు సొప్పలమ్మ జాతర


సొప్పలమ్మ మూలవిరాట్

నల్లమాడ: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగ్రామం నల్లసింగయ్యగారిపల్లిలో మంగళవారం గ్రామదేవత సొప్పలమ్మ జాతర నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు జాతర ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 1 గంటకు విందు ఉంటుందని, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

అర్జీలు త్వరగా పరిష్కరించండి

తాడిమర్రి: ప్రజల నుంచి 'స్పందన'లో అందే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని తహసీల్దార్ నజ్మాబాను మండలస్థాయి అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం 'స్పందన' నిర్వహించారు. మండల స్థాయి, సచివాలయ స్థాయి 'స్పందన' అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సూచించారు.

అబ్బురం.. ప్రగతి పథం

ఆ పంచాయతీ దశాబ్దాల తరబడి నిర్లక్ష్యానికి గురైంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా పట్టించుకున్న వారు లేరు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని ఎదురు చూడటం.. భంగపాటుకు గురవడం పరిపాటిగా మారింది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువుదీరాక ప్రగతి జాడ మొదలైంది. అభివృద్ధి పథంలో పయనిస్తున్న పంచాయతీల్లో ఒక్కటిగా కొండకమర్ల నిలిచింది.

- కొండకమర్లకు మహర్దశ
- రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులు
- సచివాలయ వ్యవస్థ సేవలు అమోఘం


పోలేవాండ్ల కొత్తపల్లి రోడ్డు



కొండకమర్ల సచివాలయం -1

పంచాయతీ పరిధిలో వివిధ పథకాల ద్వారా...

పథకం పేరు	లబ్ధిదారులు	మొత్తం
అమ్మ ఒడి	1024	రూ.లక్షలు
విద్యా దీవెన	632	రూ.లక్షలు
వసతి దీవెన	453	రూ.75 లక్షలు
రైతు భరోసా	1,618	రూ.797 లక్షలు
వైఎస్సార్ పెన్షన్ కానుక	1,654	రూ.1584 లక్షలు
చేయూత	680	రూ.296 లక్షలు
ఆసరా	959	రూ.203 లక్షలు
ఈబీసీ నేస్తం	44	రూ.11 లక్షలు
వాహన మిత్ర	38	రూ.10 లక్షలు
చేదోడు	93	రూ.19 లక్షలు
ఇంటి పట్టాలు	640	రూ.1,694 లక్షలు
మొత్తం	రూ.5332 లక్షలు	



ఓడీచెరువు : వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయి. సచివాలయ – వలంటీర్ వ్యవస్థ రాకతో గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాకారమైంది. గ్రామస్థాయిలోనే అన్ని శాఖల సేవలు అందుబాటులోకి వచ్చాయి. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. పారదర్శక పాలన కారణంగా రాష్ట్రంలోని ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధి దిశగా పయనిస్తోంది. అందులో భాగంగానే కొండకమర్ల పంచాయతీ ప్రజలు కూడా అభివృద్ధి – సంక్షేమ ఫలాలు అనుభవిస్తున్నారు. గ్రేడ్–1 పంచాయతీ అయిన కొండకమర్ల పరిధిలో మొత్తం 16 పల్లెలు ఉన్నాయి. దాదాపు 10 వేల జనాభా ఉంది. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి రోడ్లు ఎరుగని పంచాయతీ పరిధిలోని ప్రతి పల్లెలోనూ జగన్ ప్రభుత్వం అంతర్గత రహదారులు నిర్మించింది. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దింది. ఇంటింటికీ నీటి సౌకర్యం కల్పించింది. రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యం మెరుగుపరచింది. కులం, ఆదాయం, రెసిడెన్స్, అడంగల్ తదితర ఏ సేవలైనా సచివాలయం ద్వారానే పొందే ఏర్పాట్లు చేసింది. ఎవరి సిఫార్సు లేకుండా, వివక్షకు ఆస్కారం లేకుండా అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తోంది. ఇంటి వద్దకే రేషన్, పింఛన్ అందిస్తోంది.

కొండకమర్ల పంచాయతీలో అభివృద్ధి ఇలా..

పని పేరు	నిధులు
అంతర్గత రహదారులకు	రూ.180 లక్షలు
జలజీవన్ మిషన్ (ఇంటింటికీ కుళాయిలు)	రూ.60 లక్షలు
సచివాలయ నిర్మాణం	రూ.33 లక్షలు
నాడు-నేడు కింద పాఠశాలలకు	రూ.78 లక్షలు
పోలేవాండ్ల కొత్తపల్లి-కొండకమర్ల రోడ్డు	రూ.133 లక్షలు
నవాబుకోట - చెరువుమునెప్పపల్లి రోడ్డు	రూ.80 లక్షలు
మొత్తం	రూ.597 లక్షలు

వలంటీర్ వ్యవస్థ బాగుంది



మేము ఇదివరకు పింఛన్ తీసుకోవాలంటే కొండకమర్లకు పోయేవాళ్లం. అక్కడ క్యూలో ఉండి మధ్యాహ్నం భోజనం కూడా చేయకుండా పడిగాపులు కాసి పింఛన్ తీసుకునేవాళ్లం. జగన్ వచ్చాక వలంటీర్ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ ఇంటి వద్దే అందిస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ చాలా బాగుంది. మాలాంటి ముసలోళ్లకు ఇదొక వరమే.

– లక్ష్మీదేవి, పోలేవాండ్ల కొత్తపల్లి

రోడ్డుతో కష్టాలు తీరాయి



మా ఊరికి ఇంత వరకు ఏ ప్రభుత్వమూ రోడ్డు వేయలేదు. మాలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే అంబులెన్స్ వచ్చే పరిస్థితి కూడా లేకపోయేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే మాకు రోడ్డు వచ్చింది. ఊరికి కళ వచ్చింది. మండల కేంద్రానికి రాకపోకలకు మార్గం సుగమమైంది. 40 మంది పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు మంజూరయ్యాయి. చాలా సంతోషంగా ఉంది.

– రామచంద్ర, పోలేవాండ్ల కొత్తపల్లి

ప్రభుత్వ బడి అద్భుతం



కొండకమర్ల పంచాయతీ కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలను కార్పొరేట్ స్కూలును తలదన్నే రీతిలో సుందరంగా తీర్చిదిద్దారు. చాలా అద్భుతంగా ఉంది. డెస్కులు, మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. మా పిల్లలు సంతోషంగా స్కూలుకు పోతున్నారు. వారికి ట్యాబ్ కూడా ఇచ్చారు. డిజిటల్ క్లాసులు జరుగుతున్నాయి. అమ్మ ఒడి వస్తుంది. చదువుకోవడానికి ఇంతకంటే ఏం కావాలి?

– రామకృష్ణా నాయక్, శేషయ్యగారిపల్లి

పంట రుణాలు సకాలంలో రెన్యూవల్ చేసుకోండి

ఓడీచెరువు : అల్లాపల్లి సొసైటీ బ్యాంకులో పంటరుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు శివారెడ్డి, సీఈఓ రామాంజనేయులు తెలిపారు. రైతులు ఈ నెల 30 లోపు వడ్డీ మాత్రమే చెల్లించి రెన్యూవల్ చేసుకుంటే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయన్నారు. బ్యాంకు రికార్డులన్నీ కంప్యూటీకరిస్తున్నామని, రైతులందరూ తప్పకుండా వన్ బీ, అడంగల్, ఆధార్, రెండు ఫొటోలు బ్యాంకులో అందజేయాలని సూచించారు.

డయాలసిస్ బాధితుడికి పింఛన్


మారుతికి పింఛన్ అందజేస్తున్న దృశ్యం

రామగిరి: మండలంలోని గరిమేకలపల్లికి చెందిన బడగొర్ల మారుతి అనే డయాలసిస్ పేషంట్‌కు ప్రభుత్వం నూతనంగా రూ.10 వేల పింఛన్ మంజూరు చేసింది. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మారుతికి పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎజ్జె ఆంజనేయులు, రామ్మోహన్, నర్సిరెడ్డి, కొలప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

నల్లచెరువు: తలమర్లవాండ్లపల్లి పంచాయితీ పరిధిలోని యర్రగుంటపల్లిలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే సిద్దారెడ్డి మంగళవారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీటీసీ జొన్నా సుజాత తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

అమడగూరు: శీతిరెడ్డిపల్లి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియెట్ పరీక్షలు సజావుగా జరిగాయి. ఇంగ్లిష్–1 పరీక్షకు 136 మందికి గాను 129 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్ తెలిపారు.

ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలి


వైఎస్సార్‌సీపీని గెలిపించాలని మహిళను కోరుతున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి కోరారు. సోమవారం ముదిగుబ్బలోని ఎస్టీ కాలనీ, టీచర్స్ కాలనీలలో ఆయన ఇంటింటా ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరు నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రాయుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, కసిరెడ్డి కృష్ణారెడ్డి, భాస్కర్, కిరణ్‌మోహన్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, సేవేనాయక్, రామకృష్ణ, లక్ష్మీదేవి, జయమ్మ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


కదిరిలో విద్యార్థులు తయారు చేసిన నమూనాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా, డైరెక్టర్లు రంగనాథ్, పోలా ప్రభాకర్, సుబ్బారావు, ప్రిన్సిపాల్ ఫణికుమార్ విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సోలార్ ఎనర్జీ, వాక్యూమ్ క్లీనర్, మినీ ప్రొజెక్టర్, మినీ కూలర్, వాటర్ ప్రెజర్ తదితర నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సైన్స్ అధ్యాపకులు అల్తాఫ్, మేరి, జితేంద్ర, చంద్రిక పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నమూనాలు

కదిరి అర్బన్: పట్టణంలోని శ్రీ శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మోమిన్ సలీంబాషా పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో ఆశాలు


ప్రచారంలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు ఇర్ఫాన్, నారాయణమ్మ (వృత్తంలో)

ధర్మవరం: ప్రభుత్వ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎవ్వరూ రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొనరాదు. ధర్మవరం పట్టణంలోని ఆశా కార్యకర్తలు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. కేశవనగర్‌కు చెందిన ఆశా కార్యకర్త ఇర్ఫాన్, శాంతినగర్‌కు చెందిన ఆశా కార్యకర్త నారాయణమ్మ రెండురోజుల క్రితం టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ భార్య జ్ఞానతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. వీరిపై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా కార్యదర్శులకు సన్మానం


నూతన కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు

నల్లచెరువు: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులుగా నియమితులైన రైతు విభాగం జిల్లా కార్యదర్శి వై.శ్రీధర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ కార్యదర్శి నజీర్‌ను సోమవారం మండల నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కార్యదర్శులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అవకాశం కల్పించిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్‌కు ప్రత్యే ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు రాంకిషోర్ రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, కళ్లిపల్లి శ్రీనివాసులు, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, షెక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేనేత కార్మిక కుటుంబాలు



ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన చేనేత కార్మికులు

ధర్మవరం: కలకత్తా నుంచి వచ్చి ధర్మవరం పట్టణంలో స్థిరపడి చేనేత వృత్తిని కొనసాగిస్తున్న 300 కార్మికుల కుటుంబాలు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మైనార్టీ నాయకులు చాంద్‌బాషా, అమీర్‌బాషా, హిదయ్‌తుల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులకు ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏళ్ల తరబడి కలంకారి చేతి వృత్తిని నమ్ముకుని పట్టుచీరలపై అద్భుతమైన డిజైన్లు రూపొందించే కార్మికుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రస్తుతం జగనన్న సచివాలయ వ్యవస్థ ద్వారా వీరికి రేషన్‌కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ఐదేళ్ల నివాసం ఉన్న వారందరికీ పథకాలు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు నీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, సచివాలయ కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, కౌన్సిలర్‌లు, నాయకులు ఉడుముల రాము, కత్తె పెద్దన్న, అత్తార్ జిలాన్‌బాషా, బాలంగోపాల్, ఎస్‌పీ బాషా, జాకీర్, సుబాన్, కాళంగి శ్రీనా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

తనకల్లు: స్థానిక బూడిదగడ్డ వీధికి చెందిన వెంకటరమణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ మృతుని కుటుంబానికి రూ.11 వేలు, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ మొత్తాన్ని నాయకులు సానే జనార్దన్‌రెడ్డి, దేశాయి సంజీవరెడ్డి చేతుల మీదుగా సోమవారం మృతుని కుటుంబ సభ్యులకు చేర్చారు. కార్యక్రమంలో అగ్రి బోర్డు చైర్మన్ కొండా మల్లికార్జున, నాయకులు అశోక్‌రెడ్డి, మండ్లిపల్లి భాస్కర్‌రెడ్డి, ముస్తఫా పాల్గొన్నారు.

ఈవీఎంపై సిబ్బందికి అవగాహన

కదిరి అర్బన్: ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్)లపై ఎన్నికల సిబ్బందికి సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వంశీకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈవీఎంలు పని చేసే విధానం, మరమ్మతులకు గురైనపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో రూపంలో తెలియజేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం

నల్లమాడ: కమ్మవారిపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచ్ మాసే రెడ్డెమ్మ పరిష్కరించారు. గ్రామంలో 150 కుటుంబాలు ఉన్నాయి. రెండు రోజుల క్రితం తాగునీటి పథకం విద్యుత్ మోటారు కాలిపోయింది. నీటి సమస్య ఏర్పడటంతో గ్రామస్తులు సోమవారం సర్పంచ్ రెడ్డెమ్మ, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన వారు మోటారు మరమ్మతు చేయించి అదేరోజు తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. గ్రామంలో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సహకారంతో ఇటీవలే కొత్తగా బోరు తవ్వించామని, పైప్‌లైన్ ఏర్పాటు పనులు పూర్తి కాగానే నూతన మోటారు అమరుస్తామని నరసింహమూర్తి తెలిపారు.

మూఢ నమ్మకాలపై అవగాహన

ధర్మవరం రూరల్: పట్టణంలోని బ్రిలియంట్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిశేషు ఆధ్వర్యంలో సైన్సు, మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ ఐ కేర్ హరికృష్ణ, నిఖిత, పాఠశాల కరస్పాండెంట్ శేషు, సత్యం, మహేష్, గోపి, గంగాధర్, కాశీం పాల్గొన్నారు.

త్రోబాల్ ప్రీమియర్ లీగ్‌కు 'యశోద' విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ పృథ్వీరాజ్

ధర్మవరం: త్రోబాల్ ప్రీమియర్ లీగ్‌కు యశోద పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్ తెలిపారు. పట్టణంలోని యశోద పాఠశాలలో సోమవారం విద్యార్థులను అభినందించారు. గత నెలలో ఢిల్లీలో జరిగిన త్రోబాల్ పోటీల్లో తమ విద్యార్థులు నాగసాయిమిథిల, మౌనిక, వైష్ణవి ప్రతిభ కనబరిచి ప్రీమియర్ లీగ్‌కు ఎంపికయ్యారన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

ముదిగుబ్బ: సానేవారిపల్లిలో వేరుశనగ పొలాలను సోమవారం వ్యవసాయాధికారులు డాక్టర్ రవి, లక్ష్మీనరసింహులు పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి షరీఫ్, ఎఫ్‌పీఓ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, వీఎస్‌ఏ రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం వరదాపురానికి చెందిన శివారెడ్డి ఆధార్ అప్‌డేట్ చేయించుకునేందుకు సోమవారం ద్విచక్రవాహనంపై ధర్మవరం వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా కళాజ్యోతి సర్కిల్‌లో వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివారెడ్డిని ఆస్పత్రికి తరలించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నల్లచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, పెద్దయల్లంపల్లి, రాట్నాలపల్లి, మారిశెట్టిపల్లి, ఎం అగ్రహారంలోని పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ శ్రీలత సోమవారం పరిశీలించారు.

రక్తదానానికి ముందుకు రండి

ధర్మవరం అర్బన్: యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని రిటైర్డ్ కంటి వైద్యాధికారి నరసింహులు సూచించారు. పట్టణంలోని పీఆర్‌టీ సర్కిల్‌లో సోమవారం శ్రీ చౌడేశ్వరీదేవి సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 42 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కేతా లోకేష్, సభ్యులు బోనాల శివయ్య, శంకర్ యుగంధర్, ప్రసాద్, నాగరాజు, శివప్రసాద్ పాల్గొన్నారు.

టెంకాయల విక్రయ వేలం నగదు అందజేత

బత్తలపల్లి: కాటికోటేశ్వర క్షేత్రంలో టెంకాయల విక్రయానికి వేలాన్ని దక్కించుకున్న ముష్టూరుకు చెందిన తలారి నర్సింహుడు రూ.2.10 లక్షల నగదును సోమవారం గుడి ధర్మకర్త సుధాకర్‌రెడ్డి, అర్చకుల సమక్షంలో అందజేశారు.

వంద శాతం పల్స్ పోలియో


ఓడీచెరువులో పల్స్‌పోలియో శాతాన్ని పరీక్షిస్తున్న డీఐఓ

ఎన్‌పీకుంట: మండలంలో పల్స్‌పోలియో చుక్కల మందు పంపిణీ వంద శాతం విజయవంతమైందని వైద్యాధికారులు తెలిపారు. సోమవారం ఎన్‌పీకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ తిప్పయ్య, డీపీఎంఓ రెడ్డికుమార్‌రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా ఐదుగురు లెప్రసీ వ్యాధి గ్రస్తులు ఉన్నారని మండల వైద్యాధికారి డాక్టర్ ఆసియా తెలిపారు. మండలంలో 4,427 మంది చిన్నారులకు గాను అందరికీ పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగలక్ష్మి, సూపర్‌వైజర్‌లు మహేశ్వర్‌రెడ్డి, రాధమ్మ, ఫార్మసిస్ట్ ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్‌లు ఆదినారాయణ, కిషోర్ పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం

అమడగూరు: మండల వ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారులు 2,789 ఉండగా.. రెండో రోజు సోమవారం నాటికి 2,777 మందికి పల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి అపర్ణ తెలిపారు. మంగళవారం అమడగూరు, మహమ్మదాబాద్, తుమ్మల, పూలకుంటపల్లి, గుండువారిపల్లి గ్రామాల్లో పర్యటించి మిగిలిన 12 మంది చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసి వందశాతం పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేయండి

ఓడీచెరువు: మండలంలో రెండో రోజు సోమవారం ఇంటింటా నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ కృష్ణయ్య తనిఖీ చేశారు. లక్ష్యాన్ని వందశాతం పూర్తి చేయాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సు అధికారి వీరమ్మ, ఓడీచెరువు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్లు భానుప్రకాశ్, కమల్ రోహిత్, దిల్షాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే

తాడిమర్రి: మండలంలోని తాడిమర్రి, కునుకుంట్ల, పెద్దకోట్ల, ఎం.అగ్రహారం, నార్సింపల్లి, పిన్నదరి, చిల్లవారిపల్లి, ఏకపాదంపల్లి తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది పల్స్‌పోలియోపై సోమవారం ఇంటింటా సర్వే చేసి.. చిన్నారులకు చుక్కల మందు వేశారు.

సిబ్బందికి భోజన వసతి

ధర్మవరం అర్బన్: పట్టణంలో పల్స్ పోలియో విధుల్లోనున్న అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్య సిబ్బందితో పాటు క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బందికి యువర్స్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం భోజన ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, ఉపాధ్యక్షులు సుకుమార్, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర, సహాయ కార్యదర్శి నాగార్జున, పీఆర్‌ఓ రాధాకృష్ణ, క్యాంపు చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.